కేంద్ర బడ్జెట్‌తో ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు

◆ ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌తో ప్రభుత్వ ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌భాషా అన్నారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఎ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయపు పన్నులో శాశ్వత మినహాయింపు, ట్యాక్స్ పరిధిని పెంచితే ఉద్యోగులకు, వేతన జీవులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య సదుపాయాలు, ఖర్చులు కూడా ఆదాయ పన్ను పరిధిలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే క్రమం తప్పకుండా ఆదాయపన్ను చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయ పన్ను రూ.8లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలని, ప్రామాణిక తగ్గింపులు (స్టాండర్డ్ డిడక్షన్స్) ఒక లక్ష రూపాయల వరకు మినహాయింపు ఇవ్వాలని చాంద్‌బాషా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీలకు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు బడ్జెట్‌లో ఎంత కేటాయించారన్నది తెలిపాలన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్ర రాష్ట్ర రైతులను ఆదుకోవాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

తీవ్ర నిరాశకు గురి చేసిన బడ్జెట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగజేసి అప్పులు ఊబిలో కూరుకుపపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిలో పెట్టగల ప్రత్యేక హోదా ప్రకటన ఈ బడ్జెట్ లో అయినా సాకారం అవుతుందని ఎదురు చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉండగా అరకొరగా అదీ అప్పు రూపంలో 15 వేల కోట్లు కేటాయించి బడ్జెట్‌లో చేతులు దులుపుకున్నారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస ఖర్చుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై స్పష్టత లేదని, విభజన కారణంగా దెబ్బతిన్న ఏపీకి న్యాయం జరగలేదన్నారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాజకీయాలకతీతంగా భరోసా చట్టబద్ధమైన ప్రత్యేక హోదాతోనే సాధ్యమన్నారు. కేంద్రం ఏపీపై ఈ బడ్జెట్‌లోనూ వివక్ష కొనసాగించిందని దుయ్యబట్టారు.

వార్డులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-తెనాలి : మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఆధ్వర్యంలో తెనాలిలోని పలు వార్డులలో మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. కాలువలలో పేరుకుపోయిన మురుగు, కలుపు, అడ్డంకులను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. 15వ వార్డులోని వాసిరెడ్డి మున్సిపల్ ప్రైమరీ స్కూల్, నెహ్రూని కేతన్ స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలననుసరించి స్పెషల్ ఆధార్ క్యాంప్ నిర్వహించారు.

సీతారావమ్మ నేత్రదానం



విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక తెలుగుదేశం సీనియర్ నాయకుడు ధూళిపాళ్ల మోహన్‌రావు మాతృమూర్తి ధూళిపాళ్ల సీతారావమ్మ(90) మంగళ వారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యులు సీతారావమ్మ నేత్రాలను దానం చేయాలని తలంచి వెంటనే పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి ఐ బ్యాంకుకు సమాచారం అందించగా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి సీతారావమ్మ నేత్రాలను సేకరించి ఆసుపత్రి ఐ బ్యాంకుకు తరలించారు. స్థానిక టీడీపీ నాయకులు, రైతు సంఘం నేతలు పలువురు మోహనరావు మాతృమూర్తి సీతారావమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-పొన్నూరు : వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 4, 5, 6 వార్డుల్లో దోమల నివారణకు మురుగు కాలువల్లో మడ్డిఆయిల్ బాల్స్ వేయించారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవాయి, పాస్‌పోలి, ముంబయి-400087.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది 14 మే, 2024నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, **17 మే, 2024** న పత్రికా ప్రకటన ప్రచురించుట ద్వారా **రుణగ్రహీత, తాకట్టుదారు, సహ-రుణగ్రహీతలు: (1) శ్రీమతి రాజ్యలక్ష్మి కంధా భర్త నిమ్మల రమేశ్ బాబు (రుణగ్రహీత), (2) శ్రీ నిమ్మల రమేశ్ బాబు తండ్రి నాగేశ్వరరావు నిమ్మల (సహ-రుణగ్రహీత)** లను సదరు డిమాండ్ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా కాంట్రాక్చువల్ రేటున దానిపై తదుపరి వడ్డీ ప్లస్ అన్ని ఖర్చులు, చార్జీలు మరియు ఇన్సిడెంటల్ వ్యయాలుతోసహా **09.05.2024 నాటికి రూ.22,65,734/- (రూపాయలు ఇరువై రెండు లక్షల అరవై ఐదు వేల ఏడు వందల ముప్పై నాలుగు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

ఇందు పై పేర్కొనబడిన రుణగ్రహీత, తాకట్టుదారు మరియు సహ-రుణగ్రహీతలు నిర్ణీత సమయంలోగా పై సదరు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత, తాకట్టుదారు& సహ-రుణగ్రహీతలుకు మరియు సర్వ జనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, అధీకృత అధికారియైన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **22 జులై, 2024న లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి ఇందు పై పేర్కొనబడిన రుణగ్రహీత, తాకట్టుదారు, సహ-రుణగ్రహీతలు& హామీదారును మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, దిగువ ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు కాంట్రాక్చువల్ రేటున దానిపై తదుపరి వడ్డీ ప్లస్ అన్ని ఖర్చులు, చార్జీలు మరియు ఇన్సిడెంటల్ వ్యయాలుతోసహా **09.05.2024 నాటికి రూ.22,65,734/- (రూపాయలు ఇరువై రెండు లక్షల అరవై ఐదు వేల ఏడు వందల ముప్పై నాలుగు మాత్రమే)**లను చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) పై శ్రద్ధవహించవలసిందిగా రుణగ్రహీతలను కోరబడుచున్నది.

షెడ్యూలు-ఎ: (ఎఫ్ఎఫ్ఎస్ఎల్ కు తాకట్టుపెట్టిన స్థిరాస్తి వివరాలు): ఐటెం నం.1: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ ఏరియా, కాని ఇప్పుడు పట్టణ సర్వే కాలేదు, గుంటూరు సిటీ, ఆర్.టి.సి.కాలనీ, 7వ లైన్, గుంటూరు గ్రామం, డోర్ నం.537/ఎ2, డోర్ నం.15-4-120 దగ్గర, ఏదైతే విస్తీర్ణం 360చ.గ.ల సైటు, పడమర వైపు విస్తీర్ణం 100చ.గ.ల సైటు, విక్రయించిన తరువాత 55చ.గ.లకు దక్షిణం వైపు 45చ.గ.ల లక్ష్మి ఈశ్వరమ్మకు చెందిన సైటుతో ఆర్‌సిసి బిల్డింగ్. సరిహద్దులు: తూర్పు: చెంబేటి శ్రీనివాస్& ఇతరులకు చెందిన సైటు-20", దక్షిణం: శ్రీధర శర్మ& ఇతరులకు చెందిన సైటు-21-0", పడమర: కొంగ బాబూరావు& ఇతరులకు చెందిన కొంత విస్తీర్ణపు సైటు-40-00", ఉత్తరం: అంబెం సాయిబాబుకు చెందిన కొంత విస్తీర్ణంతో 12అ.ల వెడల్పు రోడ్డు తరిగి తూర్పు: కకుమాను లక్ష్మి ఈశ్వరమ్మకు చెందిన సైటు-20-0" తిరిగి ఉత్తరం: కకుమాను లక్ష్మి ఈశ్వరమ్మకు చెందిన సైటు-20-0" తిరిగి ఉత్తరం: కాకుమాను ఈశ్వరమ్మకు చెందిన సైటు-191/2-0". ఈ సరిహద్దుల్లో ఆర్‌సిసి డాబా ఇంటితో 55చ.గ.లు లేదా 45.98చ.మీ.లు. ఐటెం నం.2: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ ఏరియా, కాని ఇప్పుడు సర్వే కాలేదు, గుంటూరు సిటీ, ఆర్‌టిసి కాలనీ, 7వ లైన్, గుంటూరు గ్రామం, డోర్ నం.537/ఎ2, 100చ.గ.లకుగాను ఉత్తరం వైపు 45చ.గ.లు లేదా 37.6మీ.ల సైటు, డోర్ నం.15-4-120 సమీపాన. సరిహద్దులు: తూర్పు: చెంబేటి నాగరాజుకు చెందిన సైటు-20", దక్షిణం: వెండీ యొక్క మిగతా సైటు 19 1/2, పడమర: వెండీ యొక్క మిగతా సైటు-20-00", ఉత్తరం: 12అ.ల వెడల్పు రోడ్, పూర్తిగా 21'0"లో కొంత విస్తీర్ణంతో సగ్గెల రుబేనుకు చెందిన కొంత విస్తీర్ణం, ఈ సరిహద్దుల్లో 45చ.గ.లు లేదా 37.6చ.మీ.ల ఖాళీ సైటు.

ఆస్తి యజమాని: శ్రీ నిమ్మల రమేశ్ బాబు & శ్రీమతి రాజ్యలక్ష్మి కంధా

ప్రదేశం: గుంటూరు జిల్లా
తేది: 22.07.2024

సం/- అధీకృత అధికారి,
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

పరిశ్రమల ఏర్పాటుకు రుణాలివ్వాలి

■ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి, యువతను, మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన బ్యాంకర్ల జిల్లా కాన్సల్టేటివ్ కమిటీ(డీసీసీ) సమావేశం, జిల్లాస్థాయి రివ్యూ కమిటీ(డీఎల్ఆర్సీ) సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో రూ.34,730.55 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. ఇందులో ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయానికి సంబందించి స్వల్పకాలిక రుణాలు, టర్మ్ రుణాలు, మౌలిక సౌకర్యాల కల్పనకు, డ్వాక్రా రుణాలకు, పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఈలకు, ఎగుమతులకు రూ.24,501.93 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ.10,228.62 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించటం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి కౌలు రైతులకు రూ.180 కోట్లు ఋణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రాజధాని ప్రాంతంలో భాగమైనందున నిరుద్యోగ యువతకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు నైపుణ్యాలపై శిక్షణ అందించటంతో పాటు, ఎంఎస్ఎంఈల స్థాపనకు రుణాలు అందించాలన్నారు. కౌలు రైతులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంట రుణాలను సత్వరమే మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింతగా మెరుగుపర్చటంతో పాటు, వీధివ్యాపారులు, చిరువ్యాపారులు డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారిని వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించేందుకు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఇండియా రీజినల్ హెడ్, డీజీఎం ఎస్.జవహర్, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, ఆర్బీఐ ఎల్డీఓ నవీన్ చిరినెల్లి, నాబార్డు డీడీఎం జి.శరత్ బాబు, కెనరా బ్యాంకు ఆర్ఎం రాంమోహన్, ఎస్‌బీఐ ఆర్ఎం సత్య స్వరూపిణి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్ఎం పరిమళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జౌళి శాఖ ఏడీ వనజ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోదె కాలువ మరమ్మతులు చేపట్టండి : సీపీఐ

విశాలాంధ్ర-పొన్నూరు : బోదె కాలువ మరమ్మత్తులు చేపట్టాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావులు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలోని ఉప్పలపాడు, వెంకట కృష్ణా పురం గ్రామాలకు సంబంధించిన మాగాణి పొలాలలో నీరు నిలవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని, సంబంధిత అధికారులు బోదె కాలువ మరమ్మతులు చేపట్టి తూటికాడను తొలగించా లని డిమాండ్ చేశారు. గత వేసవిలో పనికి ఆహార పథకం కింద బోదే కాలువల మరమ్మత్తులు చేపట్టి ఉన్నట్లయితే వరద నీరు నిలిచేందుకు అవకాశం ఉండేది కాదని వారు పేర్కొన్నారు. అలానే నియోజకవర్గ పరిధిలోని అధికారులందరూ వెంటనే స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించి ప్రజలకు అంటురోగాలు, వివిధ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కుమారి, వెంకటేశ్వర్లు, రంగారావు, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై జంధ్యాల హర్షం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక కేటాయింపులలో ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించటంపై బీజేపీ రాష్ట్ర నాయకులు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌కి అధిక నిధులు కేటాయించటం, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ఈ ఏడాది నిధులతో పాటు వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించటంపై కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్‌లో ఈవీ ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : భవిష్యత్‌లో ఈవీ(ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు క్రియేట్ చేయబడుతాయని ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సందీప్ అన్నారు. విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ-వాణి (వైబ్రంట్ అడ్వోకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ ల్యాంగ్వేజెస్) ఆర్థిక సహకారంతో 'విద్యుదీకరణ చలనశీలత ఎలక్ట్రిక్ వాహనాలతో భవిష్యత్‌ను రూపొందించడం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సందీప్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనని అన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాలలో విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్స్ డిజైనిం గ్‌ను ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు కలిసి పనిచేయాలన్నారు. ఇప్పటికే సెంట్రల్ గవర్నమెంట్ ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను కొనేవారికి రాయితీలు ఇవ్వడం ద్వారా ప్రోత్సహిస్తుందన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ బ్యాటరీ పనితనం, స్టోరేజ్ గురించి విద్యార్థులకు వివరించారు. బ్యాటరీ నుంచి వచ్చేటువంటి వ్యర్థాలను విసర్జించడం ఒక సవాల్ అని తెలిపారు. భవిష్యత్తులో హైడ్రోజన్‌తో పనిచేసే వాహనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్‌లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర

విశాలాంధ్ర-మంగళగిరి : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నందున వ్యాపార దుకాణదారులు, విద్యాసంస్థలు, గృహ సముదాయాలు వద్ద యజమానులు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని మంగళగిరి రూరల్ ఎస్సై సీహెచ్ వెంకట్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, డీఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు మంగళగిరి మండలంలో కాజా గ్రామంలో మంగళ వారం గ్రామ పెద్దలు, పంచాయితీ అధికారులు, ప్రజలతో కలిసి ద్విచక్ర వాహనాలపై గ్రామంలో తిరిగి గ్రామంకు వచ్చే, గ్రామం నుంచి వెళ్లే ఎంట్రీ, ఎగ్జిట్ దారులను, గ్రామ సెంటర్‌లను, అదే విధంగా గ్రామ వెలుపల గల చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను పరిశీలించారు. కేసుల చేధనలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతు న్నాయని, సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలకు నేరస్తులు సైతం త్వరగా వెళ్లరని ఒకవేళ నేరం జరిగిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవ దానికి ఉపయోగపడతాయని తెలియజేశారు. ఎవరికి వారే సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం ప్రకటించడం హర్షణీయం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం ప్రకటించడం హర్షణీయ మని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. అర్బన్ పార్టీ కార్యాల యంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వ అరాచక ఆటవిక పాలనలో రాష్ట్రం ఏమైందో ప్రజలందరూ చూశారన్నారు. అమరావతిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇప్పుడు ఎన్డీఏ సర్కార్ భారీగా నిధులు కేటాయించిందన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు ఇవ్వడంతో రాజధాని పనులను పరుగులు పెట్టించవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయ ంలో కేంద్రం మరోసారి స్పష్టంగా హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. వెనుక బడిన ప్రాంతాలకు నిధులిస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ఏపీకి జరిగిన నష్టాన్ని కేంద్ర బడ్జెట్ ద్వారా భర్తీ చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు.

యానాదులకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి మండలం, కొలకలూరు గ్రామంలో కాలువ కట్టలపై నిరాశ్రయులుగా జీవిస్తున్న నిరుపేద యానాదులకు మంగళవారం ట్రైబల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ రావూరి అంజలి బృందం యానాది కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ అంజలి మాట్లాడుతూ తమ సంస్థ పేదలకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నామని సమాజ శ్రేయస్సే తమ ధ్యేయ మని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ వాలంటీర్లు ఇంటూరు బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SAHIK SHAHNAWAZ BEGUM (Old Name), W/o. (LATE) SHAIK IQBAL, resident at D.No.17-4-2, 1st line, Anandapeta, Guntur District-522003., A.P. I have Changed my name as SHAIK SHANAWAZ BEGUM (New Name), W/o. (LATE) SHAIK IQBAL, Henceafter my name is Known as SHAIK SHANAWAZ BEGUM (New Name), W/o. (LATE) SHAIK IQBAL for all purposes.

ఆంధ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ : ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేలు కోట్లు కేటాయించింది. అలాగే వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారు. అంతేకాదు ప్రత్యేక కార్యక్రమాల్లోనూ ఏపీకి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఏపీ ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి బడ్జెట్‌లో రూపకల్పన చేశారని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షల కోసం చంద్రబాబు నాయుడు చేసిన కృషి వల్లే ఈ రోజు బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరిగిందని, దీనికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మాధవి తెలిపారు.

నేతన్నలకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నేతన్నలకు తీవ్ర అన్యాయం జరిగిందని చేనేత పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మంగళగిరి పట్టణంలోని చేనేత పరిరక్షణ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఆరు కోట్ల జనాభా ఉన్న చేనేత పరిశ్రమకు కేటాయిం చింది కేవలం రూ.200 కోట్లు మాత్రమేనని అన్నారు. కేంద్ర బడ్జెట్ చేనేతలను నిరాశపరచిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి, రూ.10 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. చేనేత పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షులు మాచర్ల సుధాకర్, గుత్తికొండ ధనుంజయ్ రావు, సహాయ కార్యదర్శులు రావెల శివ సత్యనారాయణ, పిల్లలమర్రి బాలకృష్ణ, కమిటీ సభ్యులు రామనాథం పూర్ణచంద్రరావు, కూరపాటి కోటేశ్వరరావు, డోగిపర్తి రామారావు, జంజనం సుబ్బారావు, భీమిశెట్టి బాలతోడేరు, కౌతవరపు వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు. **జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించాలి:** ఆగస్టు 7న జాతీయ పదవ చేనేత దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు మంగళగిరి ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద గల నేతన్న సర్కిల్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సభ నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఈ సభలో చేనేత పరిరక్షణ కమిటీ నాయకులు, చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్, వస్త్ర విక్రయదారులు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్పీకర్‌గా అయ్యన్న ఎంపికను హర్షిస్తున్న బీసీలు : కేసన శంకరరావు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: బలహీనవర్గాలకు చెందిన సిహెచ్ అయ్యన్నపాత్రు దును రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా ఎంపిక చేయడాన్ని హర్షిస్తున్నామని, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలియజేస్తున్నా మని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్పీకర్ అయ్యన్నను మంగళవారం మర్యాదపూర్వకంగా కేసనతో పాటు రాష్ట్ర నాయ కులు కలిశారు. గత ఐదేళ్ల అనైతిక దూషణ భాషణలతో, ప్రజలు ఎంతగానో మనస్థాపం చెందేలా సాగిన శాసనసభ వ్యవహారాలను, ఇకనుండి అయినా చక్కదిద్దాలని కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు బీసీల సంక్షేమం-అభివృద్ధి కోసం మంచి మంచి పథకాలతో, విధాన నిర్ణయీకరణలు జరిగేలా, శాసనసభను గౌరవప్రదంగా నిర్వహిస్తారని ఆకాంక్షించారు. పలువురు బీసీ నాయకులు బొకేలనిచ్చి, శాలువాలు కప్పి, పూలమాలలతో అయ్యన్నను ఘనంగా సన్మానిం చారు. అయ్యన్నను కలిసి అభినందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు ఉన్నారు.

జీ.పాట్ పరీక్షలలో హిందూ ఫార్మశి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జీ.పాట్-2024 ఎం.ఫార్మశిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హిందూ ఫార్మశి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం అభినందనలు తెలిపారు. జీ.పాట్-2024 ప్రవేశ పరీక్షలలో 30 మంది తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని, వీరందరికీ ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో/నిపర్ సంస్థలలో తమకు నచ్చిన బ్రాంచిలో ఎం.ఫార్మశి చదవటానికి అవకాశం వస్తుందన్నారు. వీరిలో షేక్.అఫ్రిన్ బేగం 3186 ర్యాంక్, బి. సంధ్యారాణి 8213వ ర్యాంకు, ఎ.చెన్నకేశవ 10745వ ర్యాంకు, బి.లక్ష్మీ శ్రావణి 11213 ర్యాంకులను సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. జీ.పాట్ ర్యాంకు ద్వారా ఎం.ఫార్మశి చదివే విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతారన్నారు. ఆ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలలో ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధన రావు, జీ.పాట్ కోచింగ్ ఇన్‌ఛార్జ్ సీహెచ్.ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాస తనిఖీలలో భాగంగా మంగళవారం ఉదయం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను, అనంతరం ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీపాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తనిఖీ చేసారు. సీసీటీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై ఎక్స్‌పైరీ తేదిని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీఖర్, ఫిరంగిపురం తహశీల్దార్ రాఘవేంద్ర రావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బిల్లా సునీల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి తాతా సేవా కుమార్, బీఎస్పీ తరపున చిరతనగండ్ల వాసు, బీజేపీ నుంచి పద్మనాభ రావు, టీడీపీ తరపున నరసింహారావు, సీపీఐ తరపున వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

రాజధానిలో పర్యటించిన మంత్రి నారాయణ

విశాలాంధ్ర-తుళ్ళూరు : రాష్ట్రంలో 100 రోజుల్లో 100 అన్న క్యాంటీన్‌లను ఏర్పాటయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. మంగళవారం రాజధాని అమరావతిలో సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి పర్యటించారు. అమరావతి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మిస్తున్న పలు భవనాలను, వెంకటపాలెంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ, ఈ-హెల్త్ సెంటర్, మందడంలో అంగన్‌వాడీ భవనాన్ని ఆయన పరిశీలించారు. నిర్మాణాల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన మంత్రిత్వ శాఖ ద్వారా 203 అన్న క్యాంటీన్‌లు మంజూరయ్యాయని, భోజనం సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి చెప్పారు. అన్న క్యాంటీన్‌లలో భోజనం రూ.5లకే అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఆగస్టు 15నాటికి అన్న క్యాంటీన్‌లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందని అన్నారు. రాజధానిలో 17 అంగన్‌వాడీ సెంటర్లు, 16 ఈ-హెల్త్ సెంటర్లు, 14 పాఠశాలలు, అన్ని సదుపాయాలతో కూడిన శ్మశాన వాటిక నిర్మిస్తున్నామన్నారు. వచ్చే నెలాఖరులోగా భవనాలన్నీ పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలిచ్చామని చెప్పారు. ఆగస్టు నెలాఖరుకు అన్నీ పూర్తి చేసి ముఖ్యమంత్రితో ప్రారంభం చేయిస్తామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ కట్ట సింహాచలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థుల హాజరు వంద శాతం పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ విద్యా శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎంఈఓలు, డిప్యూటీ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు నమోదు కాని వాటిపై విద్యా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్ళిన వారు, డబుల్ ఆధార్ ఉన్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి విద్యాశాఖ సైట్‌లో అప్‌డేట్ చేసేలా రాష్ట్రస్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక పాఠశాలకు మారిన వెంటనే అక్కడ మ్యాపింగ్ అయ్యేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బడి మానివేసిన పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడి వారు బడికి వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులందరూ యూనిఫామ్స్ ధరించి రావాలన్నారు. యూనిఫామ్‌తో పాటు టై, షూ, బ్యాగ్‌లు ధరించాలన్నారు. ఆగస్టు 1వ తేది నుంచి యూనిఫామ్ లేకుండా విద్యార్థులను పాఠశాలకు అనుమతించరాదన్నారు. విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు కూడా వంద శాతం స్కూల్‌కు హాజరవ్వాలన్నారు. విద్యార్థి స్కూల్‌కి వచ్చిన మొదలు తిరిగి ఇంటికి వెళ్ళే వరకు ఉపాధ్యాయులదే బాధ్యత అని, ఎటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని, ఈ విషయమై ఎంఈఓలు వారి పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు నాణ్యమైన సరుకు అందించాలని, గ్రుడ్ల నాణ్యతను పరిశీలించాలని మెనూ ప్రకారం మీరు రాగి జావ, చిక్కీలను కూడా అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మీ, డిఈఓ కార్యాలయం ఏడీ నిర్మలా రాణి, డీవైఈఓ గుంటూరు, తెనాలి పి.వేంకటేశ్వరరావు, శాంత కుమారి, సీనియర్ హెచ్ డీసీఈబి సెక్రెటరీ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్: ఈ వార్తకు యాడఎ ఆబ్లిగేషనఎ ఉంది. ఫొటోతో ప్రచురించగలరు.

వైరల్ ఇన్ఫెక్షన్లతోనే సీజనల్, శ్వాసకోశ వ్యాధులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ సీజన్‌లో వైరల్ ఇన్ఫెక్షన్ల వల్లనే సీజనల్, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతాయని గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్, పల్మనాలజిస్ట్ డాక్టర్ పి.వెంకట కళ్యాణ్ అన్నారు. ఈ సీజన్‌లో దగ్గు, జలుబు లాంటి శ్వాసకోశ వ్యాధులు రావటం సహజమని, వీటి కోసం అనవసరంగా యాంటీబయటిక్స్ వాడి మనలో ఉన్న వ్యాధి నిరోధక శక్తిని తగ్గించుకోవద్దని కోరారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'సీజనల్, శ్వాసకోశ వ్యాధులు'పై ఆరోగ్య సభ జరిగింది. ఈ సభకు కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ వెంకట కళ్యాణ్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎక్కడ చూసినా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వాటి వల్ల భయపడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రోజులు వేచి చూసి తగ్గకపోతేనే డాక్టరును సంప్రదించాలని కోరారు. మన ఇంటి చిట్కాలతోనే వ్యాధులు తగ్గుముఖం పడతాయని, భయపడి యాంటీ బయోటిక్స్ వాడటంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. డాక్టర్‌ను సంప్రదించకుండా వాటిని వాడవద్దని, అసలు 70 శాతం వ్యాధులు మన శరీరంలో ఉన్న వ్యాధి నిరోధక శక్తి వల్లనే నయవుతాయని తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు మందుల షాపులు, లేబరేటరీలు, డాక్టర్ల వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. ఎన్ఎబిఎల్ 'సర్టిఫికేషన్ ఉన్న ల్యాబ్ లనే సంప్రదించాలన్నారు. ఇప్పుడు కోవిడ్ కూడా సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్స్‌లో భాగమైందని, దానికి ప్రత్యేక చికిత్స అక్కర లేదన్నారు. 60 సంవత్సరాల వయసు దాటిన వారు 'న్యూమో కాకల్ టీకా, ఇన్ ఫ్లూయంజా వ్యాక్సిన్, బీసీజీ టీకాలు వేయించుకోవటం చాలా మంచిదని చెప్పారు. ఈ సభలో సంస్థ సీనియర్ సభ్యులు పాములరెడ్డి, చలమారెడ్డి, భావన్నారాయణ, సదాశివం తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి అన్నదానం

– పాస్టర్లు, పూజారులకు వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రాతూరు గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం ప్రాతూరు టీడీపీ కార్యాలయం ఎదుట 1000 మందికి అన్నదానం నిర్వహించారు. అలాగే పాస్టర్లు, పూజారులకు ఉచితంగా వస్త్రాలు అందజేశారు. ముందుగా కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ ప్రాతూరు గ్రామంలో టీడీపీ పెట్టిన తర్వాత మెజార్టీ లేని గ్రామాన్ని తన సేవా కార్యక్రమాలతో 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రాతూరు గ్రామం నుంచి మెజారిటీ తీసుకొచ్చి ప్రాతూరు గ్రామ చరిత్రను తిరగరాసిన నాయకుడు అరవపల్లి శ్రీనివాసరావు అని అన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటూ తన ఆప్యాయతను చూపుతున్న అరవపల్లి శ్రీనివాసరావు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దోప్పలపూడి జ్యోతి బసు, మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు జానీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

చంద్రబాబు కృషితోనే రాష్ట్రానికి ప్రత్యేక నిధులు : ఎమ్మెల్యే పుల్లారావు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి, సంప్రదింపుల ఫలితంగానే ఎన్నో ఏళ్ల తర్వాత రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లోనే ప్రత్యేక నిధుల కేటాయింపులు జరిగాయని హర్షం వ్యక్తం చేశారు. మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించినందుకుగాను కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాటి అయిదేళ్ల ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి చూపిన అసమర్థతకు, చంద్రబాబు అనుభవం, ముందు చూపునకు ఇదే నిదర్శనమన్నారు. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టడంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని, కేంద్రంలో పదవుల కన్నా రాష్ట్రాభివృద్ధి మాత్రమే ముఖ్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాటలకు అర్థం కూడా ఇప్పుడు అందరికీ అర్థం అవుతోందని సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వారాల వ్యవధిలోనే వచ్చిన కేంద్ర బడ్జెట్ నుంచి అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులతో వెనకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, పారిశ్రామిక నడవా అభివృద్ధికి తోడ్పాటు సాధించడం అభివృద్ధిపై తమకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు ప్రత్తిపాటి. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రత్తిపాటి ఎన్నికలకు ముందు టీడీపీ ఎన్డీయేలో చేరడం, తర్వాత ప్రజలు అందించిన అద్భుతమైన ఆధిక్యాలతో ఇదంతా సాధ్యమైందన్నారు. ఐదేళ్ల తర్వాత కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకమైన గుర్తింపు లభించిందని సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్దామని సూచించారు.

చంద్రబాబుకు జగన్‌కు తేడాను చాటి చెప్పిన కేంద్ర బడ్జెట్: ఎమ్మెల్యే జీవీ

- ఊసరవెల్లులు సైతం సిగ్గుపడేలా జగన్ రెడ్డి వ్యవహార శైలి: ఎమ్మెల్యే జీవీ
- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యంపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హర్షం



విశాలాంధ్ర- వినుకొండ : ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి మధ్య తేడా ఏంటో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు స్పష్టంగా చాటి చెప్పాయని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సమర్థుడి చేతుల్లో రాష్ట్రం ఉంటే ఎలా ఉంటుంది? జగన్ లాంటి అసమర్థుల వల్ల ఎంత నష్టం, కష్టమో కూడా బడ్జెట్ చెప్పిందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరడంపై అవాకులు, చవాకులు పేలిన వారికి ఈ కేటాయింపులు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటన, భవిష్యత్‌లోనూ అవసరం మేర అదనపు నిధులు ఇస్తామన్న హామీపై మంగళవారం విడుదల చేసిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ కింద నిధులు కేటాయిం చడం, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలకు ఆర్థికసాయం ఎంతో ఉపయోగడనున్నాయని తెలిపారు. అయిదేళ్లు అధికారంలో వెలగబెట్టిన వైకాపా హయాంలో ఇందుకు పూర్తివిరుద్ధమైన పరిస్థితులు చూశామని, మనకు న్యాయంగా రావాల్సిన వాటిని కూడా సాధించుకోలేని అసమర్థ ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయా రని ఎద్దేవాచేశారు. 20సార్లకు పైగా దిల్లీకి వెళ్లి కేసుల గురించి వాళ్ల కాళ్లు, వీళ్ల కాళ్లు పట్టుకోవడం తప్పితే ఏనాడు రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించని జగన్‌కు, అతడి పార్టీకి ప్రస్తుతం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రయోజనాల గురించి అర్థమయ్యే అవకాశం కూడా లేదని చురకలు వేశారు. అయిదేళ్లు ముఖ్య మంత్రిగా చేసిన సమయంలో ఏరోజైనా కేసులు, కాంట్రాక్టులు తప్ప రాష్ట్రం, రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించారా అంటూ వైకాపాకు, ఆ పార్టీ అధినేత జగన్ సూటి ప్రశ్నలు వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన దానికి జగన్ మాటలు అతికినట్లు సరిపోతాయని జీవీ ఎద్దేవా చేశారు.

ఏపీకు నిధులు కేటాయింపు హర్షం



విశాలాంధ్ర-వినుకొండ : మంగళవారం పార్లమెం టులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులను కేటా యించడం పట్ల భారతీయ జనతా పార్టీ వినుకొండ పట్టణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మొదటి నుంచి భారతీయ జనతా పార్టీ చెబుతున్నట్లుగా అమరా వతి ఆంధ్రప్రదేశ్ రాజధాని అన్నదానికి కట్టుబడి ఉన్నదని, దానికి తగినట్లుగానే ఈరోజు ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్లు ప్రత్యేక సాయాన్ని అందిస్తు న్నారని, భవిష్యత్తులో అమరావతి అభివృద్ధికి అవసరమైన అన్నినిధులను కేటాయించబోతున్న ట్లుగా శ్రీమతి నిర్మల సీతారామన్ తెలిపారని పేర్కొన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగు ణంగా పోలవరం నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని ప్రకటించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జీవనాడి పోలవరం అని, దానిని పూర్తి చేయడానికి కావలసిన నిధులు మొత్తం తాము సమకూరుస్తా మని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని పారిశ్రా మిక అభివృద్ధిలో తోడ్పాటు అందిస్తామని విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ హైదరా బాదు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కూడా ప్రత్యేకంగా నిధులను కేటాయి స్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కొప్పర్తి ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు విద్యుత్ రోడ్లు హైవేల అభివృద్ధి కూడా నిధులు అందజేయనున్నారు.వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులను విడుదల చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందనే విషయం తేటతెల్లమ వుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి యార్లగడ్డ లెనిన్, పట్టణ అధ్యక్షులు ఆడిటర్ రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్, సీనియర్ నాయకులు చందలూరి వెంకట సుబ్బారావు, పట్టణ ఉపాధ్యక్షులు సుధా గణేష్ బాబు, గర్రె అనిల్, ప్రధాన కార్యదర్శులు కోట వెంకట సుధాకర్, పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా అంజనా జేమ్స్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా అంజనా జేమ్స్ మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిం చిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానం లోకి డీటీసీపీ హెడ్ ఆఫీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అంజనా జేమ్స్ డిప్యూటేషన్‌పై మంగళగిరికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పట్టణ ప్రణాళిక విభాగం డీసీపీ అశోక్ కుమార్, టీపీఓ రమేష్‌లతో టీపీఎస్, సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం

- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయం జరగలేదు
- నూటికి 80 శాతంగా ఉన్న పేదల ప్రజల బడ్జెట్ కాదిది
- సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు ఏమాత్రం పనికి వచ్చే బడ్జెట్ కాదని కార్మికులు కష్టజీవులకు మధ్యతరగతి వేతన జీవులకు ఏమాత్రం ఆనందం కలిగించే విష యం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక ప్యాకేజీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని సంతృప్తి పరచాలని కేంద్రం ప్రయత్నించడం, అలాగే రాష్ట్రంలోని ప్రధాన పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం అనుమానించ వలసిన పరిస్థితి ఉందని ఈనాటికి నరేంద్ర మోడీ, అమిత్‌షా గాని విశాఖ ఉక్కును ప్రైవేటీకరిం చబోము అని చెప్పడం లేదని అన్నారు. అమరా వతికి 15 వేల కోట్లు కేటాయిం చడం కొంత హర్షించ దగిన విషయమే అయినప్ప టికిని విశాఖ రైల్వే జోన్ కడప స్టీల్ ఫ్యాక్టరీ పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయి ంపు స్పష్టంగా పేర్కొనలేదని ఆయన విమర్శిం చారు. నిరుద్యోగులకు నిరాసే మిగిలిందని రాష్ట్ర అభివృ ద్ధికి కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయుటకు కేంద్రం రాష్ట్రా నికి తగిన నిధులు కేటాయించ లేదని ఆయన విమర్శించారు. పెట్టుబడిదారుల స్వర్గధామంగా దేశంలో నరేంద్ర మోడీ విధానాలు ఉన్నాయని పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్న తికి ఈ బడ్జెట్ ఏ మాత్రం పనికిరాదని ఆయన కేంద్రాన్ని విమర్శిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర అభివృద్ధికి కావలసిన నిధులను పోలవరం ప్రాజెక్టుకు నిర్వాసి తులకు ఇవ్వవలసిన నిధులను వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని మారుతీ కోరారు.

టిడ్కో ఇళ్లు కొనటం, అమ్మటం నేరం

- కమిషనర్ గోవిందరావు, పట్టణ సీఐ రమేష్



విశాలాంధ్ర-చిలకలూరిపేట : టిడ్కో గృహాలను అమ్మడం, కొనడం నేరమని కమిషనర్ సీహెచ్ గోవిందరావు, అర్బన్ సీఐ పి. రమేష్ స్పష్టం చేశారు. మంగళ వారం ఇతర అధికారులతో కలసి టిడ్కో గృహాలను సందర్శించారు. పార్కులో పారిశుధ్య పనులు అమలౌతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు లబ్దిదారుల నుంచి ఇళ్లను కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. లబ్ధిదారులు ఆ గృహాలను వారి కుటుంబ అవసరాల కోసం వారు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవడం నేరమన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం తాకట్టు పెట్టడం, కొనడం నేరమన్నారు. ఎవరైతే తాకట్టు పెట్టారో, ఎవరైతే కొన్నారో వారిని విచారణ జరిపించి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీరి వెంట ఎస్ఐ పుల్లారావు, డీఈఈ వెంకటరమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు ఉన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన పిడుగురాళ్లకు చెందిన బత్తుల శేఖర్, మురికిపూడి ప్రదీప్ చంద్ర అను ఇరువురు ముద్దాయి లను పిడుగురాళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎస్ వెంకట్రావు తెలిపిన వివరాలు ప్రకారం బత్తుల శేఖర్ ఏజెన్సీ ఏరియా నుండి కేజీ గంజాయి కొని పిడుగురాళ్ల పట్నానికి తీసుకొని వచ్చి మురికిపూడి ప్రదీప్ చంద్రతో కలిసి చిన్న చిన్న ప్యాకెట్లుగా ఒక్కొక్క ప్యాకెట్ రూ.200లకు విక్రయిస్తున్నట్లు తెలి పారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ముందస్తుగా రాబడిన సమాచారం మేరకు మురికిపూడి ప్రదీప్ చంద్ర అను అతని వద్ద నుండి పిడుగురాళ్ల పట్టణ జానపాడు రోడ్ రైల్వే గేటు సమీపంలో రోడ్‌కు తూర్పు వైపున వున్న ఖాళీ స్థలం వద్ద 1080 గ్రాముల గంజాయి పట్టుకొని కేసు నమోదు చేసి మురికిపూడి ప్రదీప్ చంద్ర అను అతన్ని అరెస్ట్ చేయటం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శిరస్త్రాణం ధరించండి-ప్రమాదాలను నివారించండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాల ప్రకారం సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ చల్లా నాగ వెంకట శ్రీనివాసరావు సూచనల మేరకు మోటార్ వాహనాల ప్రమాదాల నివారణ, హెల్మెట్ ధరించడం అంశంపై సత్తెనపల్లి అమరావతి బస్ స్టాప్ సెంటర్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున మాట్లాడుతూ హెల్మెట్ విరివిగా ధరించి ప్రమాదాలు నివారించాలని తెలిపారు. అదేవిధంగా మోటార్ వెహికిల్ చట్టం 1988లో పలు నేరాలు వాటి జరిమానాలు గురించి వివరించారు. రవాణా శాఖ అధికారి యు.ధర్మేందర మాట్లాడుతూ ప్రతి రోజూ భారతదేశంలో హెల్మెట్ ధరించకుండా అధిక సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారని, ప్రమాదాలు నివారించేందుకు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా పాటించాలని సూచించారు. అదే విధంగా మైనర్ డ్రైవింగ్, లైసెన్స్, అధిక లోడు లాంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ మైనర్ పిల్లలుకు వాహనాలు ఇచ్చి ప్రమాద కారకులు అవకండి, మైనర్ డ్రైవింగ్ చట్ట రీత్యా నేరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు షేక్ ఖాజావలి, షేక్ ముబారక్, కోర్టు కానిస్టేబుల్ తుపాకుల బాజి, సలీం ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మస్తాన్‌రావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటప్పరెడ్డి మృతి



విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గత 70వ దశకంలో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ మాస్టరుగా పని చేసి అనంతరం ప్రధానోపాధ్యా యుడిగా రిటైర్ అయిన వై. వెంకటప్పారెడ్డి మాస్టారు మంగళవారం మృతి చెందినట్లు అరసం రాష్ట్ర నాయకులు కమ్మాలపాటి శరత్చంద్ర జ్యోతి శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం శరత్ మాట్లా డుతూ వెంకట అప్పారెడ్డి మాస్టారు అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దిన మాస్టారు చనిపోవడం బాధాకరమన్నారు. విజయవాడ పోరంకిలో పెద్ద కుమార్తె ఇంటిలో కన్నుమూశారని తెలియజేయడానికి విచారిస్తున్నాను. వారు కొంతకాలంగా ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 25వ తేదీ గురువారం అంత్యక్రియలు అని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపకార వేతనాలు అందజేసిన ఎన్‌సీసీ కల్నల్ సజల్ కాంతిదాస్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేసినట్లు ఎన్‌సీసీ కల్నల్ సజల్ కాంతిదాస్ తెలిపారు. శ్యామల నగర్‌లోని ఎన్‌సిసి కార్యాలయంలో మంగళవారం ఆర్మీ సైనికుల పిల్లలు పదో, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన వారికి పారితోషికాన్ని ఆయన అందచేశారు. ఈ ఏడాదిలో 142 మంది విద్యార్థులకు ఈ ప్రతిభ పురస్కారలను అందచేసినట్లు ఆయన చెప్పారు. ప్రతీ విద్యార్థికి రూ.5వేలు అందచేశామని, రాబోయే రోజుల్లో ప్రతిభ కనబర్చిన వారాందరికి ప్రతిభ పురస్కారలను అందచేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

నేడు అయ్యంకి, డాక్టర్ వెలగా గ్రంథాలయ సేవా పురస్కార సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 24వ తేదీ బుధవారం సాయంత్రం ఆరున్నర గంటలకు గ్రంథాలయ పితామహ అయ్యంకి, గ్రంథాలయ గాంధీ డాక్టర్ వెలగా, గ్రంథాలయ సేవా పురస్కార సభ, డాక్టర్ కౌలా ఎండోమెంట్ ఉపన్యాసం స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై జరుగుతుందని శ్రీ అన్నమయ్య సేవా సమితి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, విశిష్ట అతిథిగా ధర్మజ్యోతి శ్రీలంకా సూర్యనారాయణ, పురస్కార ప్రదాతలు పూర్వ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్, డాక్టర్ ఆరేటి కృష్ణకుమారి ఆత్మీయ అతిథులుగా ఆచార్య అయంకి మురలీకృష్ణ, డాక్టర్ వెలగా నాగార్జునలు పాల్గొంటారన్నారు. 2024 సంవత్సరానికి పురస్కార గ్రహీతలుగా ఆచార్య వెలుఓలు నాగ రాజ్యలక్ష్మి, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం గ్రంథాలయ అధికారి ఆచంట రజనీ కుమారిలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రొఫెసర్ కౌలా ఎండోమెంట్ ఉపన్యాసం నేటి తరుణంలో పుస్తక భవితవ్యం అంశంపై ఆచంట రజని కుమారి చేస్తారని, గ్రంథాలయ అభిమానులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని దేవస్థానం అధ్యక్షులు మస్తానయ్య, ప్రోగ్రాం కన్వీనర్ పావులూరి శ్రీనివాసరావులు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం గోళ్ళమూడి పాడు యూనిట్ బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ రాజారత్నం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపరంగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకు ంటే భూమి నుంచి విత్తనాలకు సోకే వివిధ రకాల బ్యాక్టీరియల్ వైరస్‌లను, చీడపీడలను 30 రోజుల పాటు కాపాడుకోవచ్చని, తద్వారా అధిక దిగుబడులు పొంద వచ్చని తెలిపారు. బీజామృతం అనేది విత్తనాలకు వాక్సిన్‌ల పనిచేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసా యంపై వివిధ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ సామూహి కంగా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకొని పంటలకు భూమి ద్వారా గాని, విత్తనాల ద్వారా గాని వ్యాపించే తెగుళ్లను, చీడపీడలను అరికట్టాలని సూచించారు. ఈ సందర్భంగా 15 ఎకరాలకు సరిపడా వడ్లను బీజామృతంతో విత్తనశుద్ధి నేర్పించారు. కార్యక్రమంలో అదుషా, బుజ్జి బాబు, నాగబాబు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓఎస్‌డీగా ప్రొఫెసర్ రవికుమార్



విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఓఎస్‌డీగా ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ ఎస్‌ఎన్ రవికుమార్(ఫిజిక్స్) నియమితులయ్యారు. అలాగే రుసా కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎస్.మురళీ మోహన్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఇరువురికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఓఎస్‌డీగా రవికుమార్ బాధ్యతలు చేపట్టారు.

నేడు భాద్యతలు చేపట్టనున్న పలువురు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు తీసుకున్న పలువురు అధికారులు బుధవారం విధుల్లో చేరనున్నారు. దూర విద్య కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు(సోషియాలజీ) దూరవిద్యా కేంద్రం పరీక్షలకు ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్(కెమిస్ట్రీ), సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ వి.రవికుమార్(ఫిజిక్స్)లు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

75 తాళ్లూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా జ్యోతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా మంగళ వారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టినట్లు మంగళవారం ఒక ప్రకటనలో బ్యాంకు మేనేజర్ జ్యోతి తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాళ్లూరు బ్యాంకు పరిధి లోని గ్రామాల రైతులు గోల్డ్ లోను క్రాప్ లోన్లు రభి సీజన్లో పెట్టుబడులకు లోన్లు ఖాతా దారులు తక్కువ వడ్డీతో పొలాల పెట్టుబడులకు వినియోగించుకోవాలని ఈ అవకాశాన్ని యూనియన్ బ్యాంక్ ఈ పరిధిలోని గ్రామాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది

విశాలాంధ్ర-గురజాల : సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడంలో దాతల సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుండా కాశీ విశ్వనాథం అన్నారు. గురజాల శ్రీపాటి పాటమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులకు, వృద్ధులకు, అనాధలకు, యాచకులకు స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి మంగళ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను అభినం దిస్తూ ఈ మంగళవారం పఠాన్ మస్తాన్ ఖాన్ జ్ఞాపకార్థం కుమారుడు పఠాన్ రహీం ఖాన్ అన్నదాన కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించారని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తెలిపారు. వారికి స్మైల్ పౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ముఖ్య అతిథిగా కొత్తపల్లి సాంబశివరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పదని, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సేవ చేసే వారిని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గని, ఉపాధ్యక్షులు బండి రవి, స్మైల్ ఫౌండేషన్ సభ్యులు కనకం హనుమంతరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం : యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల: స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను పట్టణ ఆర్యవైశ్యులు కొనసాగించటం అభినందనీయమని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఆర్.అండ్.బి బంగ్లా సెంటర్లోని అన్న క్యాంటీన్ ను ఆయన సందర్శిం చారు. యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెట్టాలనే సంకల్పం అన్న ఎన్టీఆర్‌దన్నారు. ఆగస్టు 15 నుండి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభమవుతాయన్నారు. పేదవారికి రుచికరమైన ఆహా రాన్ని కేవలం రూ.5ల ధరకే మూడు పూటలా అందించేలా సీఎం చంద్రబాబు దాతృత్వం వెలకట్టలేనిదన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం పాటుపడే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని అన్నారు. అనంతరం క్యాంటీన్ కొనసాగిస్తున్న పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులను ఆయన ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో వీడేలా రామకృష్ణ, పోలా సత్యం, దారువేముల రామకృష్ణ, చీదెళ్ల ఆంజనేయులు, కాపు నాయకులు జక్కా నరసింహా రావు, పట్టణ తెలుగు మహిళా నాయకులు పద్మా రెడ్డి, భవాని బాయ్, తిక్క కొండలు, దుర్భాకుల ప్రసాద్, పిన్నంశెట్టి, గాజుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేతన్న విగ్రహం వద్ద పరిశుభ్రం చేయాలి



విశాలాంధ్ర-మంగళగిరి : ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం చుట్టు ఉన్న పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయాలని చేనేత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీం భాషాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతకు ప్రసిద్ధిగాంచిన మంగళ గిరి నగరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేతన సర్కిల్‌కు ప్రభుత్వమే పూర్తిగా మెరుగులు దిద్దాలని ఆ వినతిపత్రంలో కోరారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో చేనేత పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మాచర్ల సుధాకర్, కొతవరపు వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రెక్టార్, రిజిస్ట్రార్‌లను కలిసిన దినసరి ఉద్యోగులు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతన ఇన్‌చార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లులను దినసరి ఉద్యోగులు కలిసి అభినందనలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృ ద్ధిని రెట్టింపు చేయాలని కోరారు. రాష్ట్రంలోనే నంబర్ 1 యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దినసరి ఉద్యోగుల సంఘం మాజీ సెక్రటరీ నంబూరు సాంబయ్య, జె.రాము, ఎం.చంద్రశేఖర్, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై గ్రామసభలు



విశాలాంధ్ర-కారంపూడి : మండలంలోని వేపకంపల్లి, పెద్ద కొదమగుండ్ల, గాదెవారిపల్లి, చిన్న కొదమగుండ్ల గ్రామాలలో స్వచ్ఛ భారత్ జలజీవన్ మిషన్, సీజన్ వ్యాధులపైన మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామలలో స్వచ్ఛభారత్ పథకం కింద నూరు శాతం మరుగు దొడ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకో వాలని, గ్రామాలలో తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించి ప్రాసెసింగ్ చేసి ఎరువులు తయారుచేయాలని, గ్రామపంచాయతీలలో మురుగు కాలువల పూడికలు తీయించాలని వాటర్ ట్యాంకులు వారానికి ఒకసారి శుభ్రం చేయించాలని గ్రామాలలో బ్లీచింగ్ చల్లించాలని ఫాగింగ్ మిషన్లతో దోమలు రాకుండా స్ప్రే చేయించాలని ఈవోపీఆర్డి సత్యప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకుసూచించారు. పెద్ద కోదమ గుండ్లలో జరిగిన గ్రామసభలో గ్రామ సభకు లక్ష్మయ్య అధ్యక్షత వహిం చారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్‌సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాజు, కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు రామరాజు, రాజేష్ బాబు, చెన్నకేశవరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

హాస్య కళాకారుడు జయప్రకాష్ మృతి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ పట్టణ నివాసి కట్టెంపూడి జయ ప్రకాష్ (71) సోమవారం రాత్రి మృతి చెందారు. అయన డిగ్రీ వరకు చదువుకొని వినుకొండ సీనియర్ న్యాయవాది అల్లు శివరామయ్య వద్ద లీడర్ గుమస్తాగా చాలా కాలం పని చేశారు. వీరు సాహిత్య రంగంలోనూ చిన్నచిన్న నాటికలు రచించడం, రాయటం, దర్శకత్వం వహిం చారు. వీరు వినుకొండ పరిసర ప్రాంతాల్లో అభినవ దుర్యోధన అనే హాస్య ఏకపాత్రాభినయాన్ని ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి అనేక మందిని తను హాస్య చతురుతో ఆనందింపజేశారు. ఇటీవల కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వీరు సోమవారం మృతి చెందారు. వీరికి ప్రముఖ భాగవతార్ వీరగంధం సుబ్బా రావుతో సాన్నిహిత్యం, ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు రచయిత ఆత్రేయ గార్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుతూ సంబంధాలను కొనసాగించేవారు. వీరు మృతికి పట్టణానికి చెందిన కళాకారులు సాహితీ వ్యక్తులు బంధు మిత్రులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి



విశాలాంధ్ర-విజయపురిసౌత్: 11 కేవీ విద్యుత్ లైన్ వైర్ తెగి పడటంతో విద్యుద్ఘాతానికి గురై రైతు మృతిచెందిన సంఘటన మాచర్ల మండలం పశువేముల గ్రామంలో మంగళ వారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పసువేముల గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి(65) భార్య కాంతమ్మతో కలిసి తనకున్న 5 ఎకరాల పొలంలో పనులు చేసేందుకు వెళ్ళారు. భార్య పొలంలో కలుపు తీస్తుండగా శ్రీహరి పుల్లలు ఏరుతున్నాడు. అదే సమయంలో తన పొలం మీదుగా వెళ్ళే 11 కేవీ విద్యుత్ లైన్ వైర్ ఇన్సులేటర్ దగ్గర తెగి శ్రీహరి మీద పడగా విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్ళ ముందే భర్త చనిపోవటంతో కాంతమ్మ రోధిస్తున్న తీరు పలువురు గ్రామస్థులను కలచివేసింది. శ్రీహరికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

దేవాలయంలో చోరీ

విశాలాంధ్ర-శావల్యపురం: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెం గ్రామంలోని శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈశాన్యంలోని గేటుకు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం దేవాలయంలో పూజా కార్యక్రమాలు ముగిసిన తరువాత వాచ్‌మెన్ గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మంగళవారం ఉదయాన్నే దేవాలయం వద్దకు రాగానే తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. గేటుకున్న గడులను వంచివేసి తాళాలు పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. దేవాలయంలోని రెండు హుండీలు పగులగొట్టి వాటిలోని నగదును, ప్రక్కనే ఉన్న ఇనుప బీరువాలోని అమ్మవారి చీరెలు, నాలుగు సీసీటీవీ కెమేరాలు, కెమేరాల కోసం అమర్చిన టీవీ తదితర సామాగ్రిని అపహరించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ చల్లా సురేష్ సిబ్బందితో దేవాలయం వద్దకు చేరుకొని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ గుర్తు తెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అరుణాచలంకు బస్సు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఈ నెల 27వ తేదిన సత్తెనపల్లి నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ డీఎస్ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. 28వ తేదీ ఉదయం కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అనంతరం అరుణాచలం బయలుదేరుతుందన్నారు. 29న పౌర్ణమి రోజున గుడి ప్రదక్షిణ చేసుకుని తిరుగు ప్రయాణంలో కంచి కూడా చూసుకుని 30వ తేది తిరిగి సత్తెనపల్లి చేరుతుందని, సూపర్ లగ్జరీ పుష్ బ్యాక్ 2+2 రాను పోను ఒక మనిషికి రూ.2500లుగా టికెట్ చార్జీ చేయబడునని తెలిపారు. సీట్ నమోదు కోసం 9959225429, 7382896966, 7382895691 నెంబర్లలో సంప్రదించాలని అన్నారు.

మాట నిలబెట్టుకున్న ఎన్డీఏ ప్రభుత్వం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్ర చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని, ఎన్డీయే కూటమి నేతృత్వంలో అంధకారం నుంచి అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా దూసుకుపోతోందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. మంగళవారం కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికై వరాల జల్లు కురిపించటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు ప్రధాని మోదీ, నిర్మలా సీతారామన్, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు శ్రీనివాసరావు తోటలో పాలాభిషేకం చేశారు. కూటమి నేతలు శ్రావణ కుమారి, జూపూడి భవాని, పద్మ, సయ్యద్ షర్ఫుద్దీన్, గద్దం రోశయ్య, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి : ఎంపీడీఓ శివప్రసాద్

విశాలాంధ్ర-దుర్గి : ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ. పి. శివప్రసాద్ గ్రామస్తులకు సూచించారు. మండల పరిధిలోని అడిగొప్పల, ధర్మవరం, ఆత్మకూరు గ్రామాల్లో మంగళవారం ఓడీఎఫ్ ప్లస్, హర్ గర్ జల్ పథకాలపై ప్రజలకు అవగాహన గ్రామ సభ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనలు చేయవద్దని, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన గ్రామసభల్లో అవగాహన కల్పించారు. బుధవారం రాజానగర్, ఓబులేశునిపల్లె, కోలగుట్ల, కంచరగుంట్ల గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.